TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 166   శనివారం 08-02-2025   పేజీలు :06   వేల : 05/-

## కులగణనలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలి



**హైదరాబాద్ ఫిబ్రవరి 7 :** కులగణనలో ఏ తప్పుల లేవని, ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసిలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, సబ్‌ప్లాన్, పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో పొన్నం మీడియాతో మాట్లాడారు. కులగణన భారత దేశం మొత్తం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా? అని ప్రశ్నించారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉందని, ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పూర్తి చేసిందని పొన్నం కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఇష్టపూర్వకంగా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదని, ఆవహేళన మాత్రం చేశారని ధ్వజమెత్తారు. సర్వేలో పాల్గొన్న వాళ్లకే మాత్రమే కులగణనపై మాట్లాడే అవకాశం ఉంటుందని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణన చేయడంలేదని మోడీ ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చిందని, బిజెపి పార్టీ ప్యూడలిస్టిక్ పార్టీ అని పొన్నం ధ్వజమెత్తారు.

## ప్రధాని మోడీతో అక్కినేని ఫ్యామిలీ



ప్రధాని నరేంద్ర మోడీని అక్కినేని ఫ్యామిలీ మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం పార్లమెంట్‌లో కింగ్ నాగార్జున దంపతులు, నాగ చైతన్య దంపతులతోపాటు అక్కినేని కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రధానిని కలిశారు.ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుతం మోడీని కలిసిన అక్కినేని ఫ్యామిలీ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా, ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే.

## చంద్రబాబు నాయుడితో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బృందం బేరి




**అమరావతి, ఫిబ్రవరి 7 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. భేటీ కోసం శుక్రవారం ఉదయం సచివాలయానికి చేరుకుంది నీతి ఆయోగ్ బృందం. ఈ సందర్భంగా సుమన్ బేరీ నేతృత్వంలోని నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులతో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ భేటీ అవనున్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వికసిత్ ఏపీ - 2047 విజన్ డాక్యుమెంట్‌పై చర్చించనున్నారు. ఏపీలో అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భేటీలో చంద్రబాబు, పయ్యావుల చర్చించనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే 16వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పనగారియాను సీఎం చంద్రబాబు, పయ్యావుల కలిసిన విషయం తెలిసిందే.నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంలో కీలక బృందం ఈరోజు ఏపీకి వచ్చారు. ఏ.ముత్తు కుమార్ ఐఏఎస్, పార్థసారథి రెడ్డి ఐఏఎస్. కె. కిషోర్ భేటీలో పాల్గొన్నారు. అలాగే నీతిఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ ఈ భేటీకి ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వికసిత్ ఏపీ-2047 విజన్ డాక్యుమెంట్‌పై ప్రధానంగా చర్చించనున్నారు. ఏపీకి ఉన్న అప్పులు వాటితో పాటు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమావేశంలో చర్చ జరుగనుంది. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితిని వారికి వివరించనున్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్‌ను కూడా కలిసిన నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రప్పించుకోవడంతో పాటు పన్నుల్లో వాటా, వివిధ కేంద్ర ప్రయోజిత పథకాల్లో రావాల్సిన వాటాలపైన రాష్ట్రం తీసుకుంటున్న చర్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై వీరి భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

## అర్వింద్ కేజ్రీవాల్ నివాసం వెలుపల ఎసిబి బృందానికి చుక్కెదురు



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 7 :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అర్వింద్ కేజ్రీవాల్ నివాసం వెలుపల శుక్రవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారతీయ జనతా పార్టీ (బిజెపి)పై ఆప్ చీఫ్ చేసిన ముడుపుల ఆరోపణలపై ఆయనను ప్రశ్నించేందుకు ఎసిబి బృందం ప్రయత్నించినప్పుడు వారికి ఆయన నివాసం లోపలికి వెళ్లనివ్వలేదు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు వోట్ల లెక్కింపుజరగడానికి ముందు రోజు ఈ పరిణామం చోటు చేసుకుంది. బిజెపిపై ఆప్ చేసిన 'ఆపరేషన్ లోటస్' ఆరోపణపై దర్యాప్తు నిర్వహించాలని ఎసిబిని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వికె సక్సేనా ఆదేశించారు. కేజ్రీవాల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక న్యాయవాది ఎసిబికి ఈ చర్య తీసుకునేందుకు అధికారం లేదని స్పష్టం చేశారు.'వారి వద్ద ఎటువంటి పత్రాలూ లేవు. రాజకీయ ప్రహసనం సృష్టికి బిజెపి పన్నిన కుట్ర ఇది' అని ఆయన ఆరోపించరు. పార్టీ ఫిరాయించేందుకు తమ అభ్యర్థులకు బిజెపి రూ. 15 కోట్లు ఇవ్వజూపిందన్న ఆప్ ఆరోపణ ఈ వివాదానికి మూలం. తమ అభ్యర్థుల్లో 16 మందికి పార్టీ మారినట్లయితే ఒక్కొక్కరికి రూ. 15 కోట్లు, మంత్రి పదవులు ఆఫర్ చేశారని ఆప్ అధినేత కేజ్రీవాల్ ఇంతకుముందు ఆరోపించారు. ఆప్ ఆరోపణలపై ఢిల్లీ బిజెపి కార్యదర్శి విష్ణు మిత్తల్ ఫిర్యాదు చేసిన తరువాత ఎల్‌జి ఎసిబి దర్యాప్తునకు ఆదేశించారు. 'అర్వింద్ కేజ్రావాల్, సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలు ఎంతో తీవ్రమైనవి. తక్షణ దర్యాప్తు జరిపించవలసినవి' అని మిత్తల్ ఎల్‌జి సక్సేనాకు రాసిన లేఖలో వ్యాఖ్యానించారు. ఆప్ నేతలు తమ ఆరోపణల ధ్రువీకరణకు ఎటువంటి రుజువులూ లేదా ఆధారాలూ చూపలేదని మిత్తల్ తెలిపారు.'

## ఇప్పట్లో క్యాబినెట్ విస్తరణ ఉండకపోవచ్చు..

### క్యాబినెట్ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



**న్యూ డిల్లీ ఫిబ్రవరి 7:** తెలంగాణ క్యాబినెట్ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గంలో ఎవరుండాలనేది అధిష్టానం నిర్ణయిస్తుందని తాను ఎవరి పేరును ప్రతిపాదించలేదని చెప్పారు.అయినా ఇప్పట్లో క్యాబినెట్ విస్తరణ ఉండకపోవచ్చని స్పష్టం చేశారు."నాకు రాహుల్ గాంధీకి ఎలాంటి విబేధాలు లేవు. మేము చాలా సన్నిహితంగా ఉంటాము. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో చట్ట ప్రకారమే వెళ్తాం. త్వరగా అరెస్టు చేయించి జైలులో వేయాలనే ఆలోచన మాకు లేదు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వే చేశాం. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో ప్రకటన వస్తుంది" అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## ఫిబ్రవరి 12-13 తేదీల్లో అమెరికాలో పర్యటించనున్న ప్రదాని మోదీ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 7 :** ప్రధాన నరేంద్ర మోదీ అమెరికా పర్యటన తేదీలు ఖరారు అయ్యారు. ఫిబ్రవరి 12-13 తేదీల్లో మోదీ అమెరికాలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారంనాడు తెలిపారు. తన పర్యటనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను మోదీ కలుసుకుంటారు."ఫిబ్రవరి 12,13 తేదీల్లో ప్రధాని మోదీ అమెరికాలో అధికారిక పర్యటిస్తారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకరాం చేపట్టిన తర్వాత మోదీ జరుపుతున్న తొలి పర్యటన ఇది. ట్రంప్ ప్రమాణస్వీకారం అనంతరం మొదటగా కలుసుకోనున్న కొద్ది మంది ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు" అని మిడియా సమావేశంలో మిస్రీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడిని వచ్చేవారంలో కలుసుకునేందుకు మోదీని ఆహ్వానించినట్టు వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు ఇటీల ప్రకటించిన క్రమంలో మోదీ పర్యటన తేదీలు ఖరారయ్యారు.భారత ప్రధానమంత్రికి తాను ఆతిథ్యం ఇవ్వనున్నట్టు ట్రంప్ గత నెలలో ప్రకటించారు. "చాలాకాలం తర్వాత ఈరోజు ఉదయం ఫోనులో మాట్లాడాను. బహుశా ఫిబ్రవరిలో ఆయనకు శ్వేతసౌధానికి వచ్చే అవకాశం ఉంది" అని ట్రంప్ తెలిపారు. గత జనవరి 27న ట్రంప్‌తో మోదీ ఫోనులో సంభాషించారు. అంతర్జాతీయ శాంతి, భద్ర, టెక్నాలకీ-ట్రేడ్-డిఫెన్స్ రంగాల్లో అడ్వాన్స్‌డ్ కోఆపరేషన్‌కు తీసుకోవాల్సిన చర్యలపై ఉభయులూ చర్చించారు. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడంతో పాటు దేశంలోని స్కిల్డ్ వర్కర్లకు వీసాల మంజూరును సులభతరం చేయాలని ప్రధానంగా ఈ పర్యటనలో ట్రంప్ దృష్టికి మోదీ తీసుకువచ్చే అవకాశాలున్నాయి.

TEL:T/TG/2024/0814
మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# జన్మత: పౌరసత్వం రద్దు ఉత్తర్వుల అమలుపై స్టే



**గ్రీన్‌బెల్ట్ :** జన్మత: పౌరసత్వం లభించడాన్ని రద్దు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఆదేశాల అమలును నిలుపుచేస్తూ ఫెడరల్ జడ్జి ఒకరు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పౌరసత్వం అనేది అత్యంత విలువైన హక్కని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 14వ సవరణకు ట్రంప్ ప్రభుత్వం చెప్పిన భాష్యాన్ని ఈ దేశంలోనిఏ న్యాయస్థానం కూడా ధృవీకరించడం లేదని డిస్ట్రిక్ట్ జడ్జి దెబరా బోర్డ్‌మన్ చెప్పారు. ఈ తరహా ఆదేశాలు జారీ చేసిన మొదటి కోర్టు ఇది కాదన్నారు. పౌరసత్వమనేది జాతీయస్థాయిలో ఆందోళన కలిగించే అంశమని, దీనికి ఒకే రకమైన విధానం వుండాలనిఅన్నారు. జాతీయ స్థాయిలో ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేస్తేనే కక్షిదారులకు పూర్తి ఉపశమన కలుగుతుందని వ్యాఖ్యానించారు. తన రూలింగ్ చదివి వినిపించిన తర్వాత దీనిపై అప్పీల్ చేస్తారా అని న్యాయమూర్తి, ప్రభుత్వ అటార్నీనిప్రశ్నించారు. వెంటనే దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం తనకులేదని ఆయన చెప్పారు. ట్రంప్ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన వారంలోనే ఈ ఆదేశాలపై అమలును తాత్కాలికంగా నిలుపు చేస్తూ ఫెడరల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఆ తాత్కాలిక గడువు గురువారంతో ముగియనున్న నేపథ్యంలో న్యాయమూర్తి బర్డ్‌మన్ ప్రాథమిక ఇంజక్షన్ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ కేసులోని అంశాలను పరిష్కరించేవరకు ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తునుట్లు ఆమె పేర్కొన్నారు. ఈలోగా ట్రంప్ ప్రభుత్వం కావాలంటే దీన్ని అప్పీల్ చేసుకోవచ్చు. ట్రంప్ చర్యను నిరసిస్తూ మొత్తంగా 22 రాష్ట్రాలు, ఇతర సంస్థలు కేసులు నమోదు చేశాయి. ఈ వారంలో ఇతర కేసుల విచారణలు, ఉత్తర్వులు కూడా వెలువడే అవకాశం వుంది.

# కాల్పుల విరమణ ఒపందం నేపథ్యంలో

## గాజాలోకి 10వేలకుపైగా సహాయ ట్రక్కులు



జెనీవా : గాజాలో జనవరి 19నుండి కాల్పుల విరమణ ఒప్పందంలో అమల్లోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 10వేలకుపైగా సహాయ ట్రక్కులు గాజాకు చేరుకున్నాయని ఐక్యరాజ్య సమితి మానవతా సహాయ చీఫ్ టామ్ ఫ్లెచర్ గురువారం తెలిపారు. కేవలం రెండు వారాల్లోనే ఈ ట్రక్కులను పంపినట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సాయం తీసుకెళుతున్న కాన్వారుతో పాటు తాను కూడా ఉత్తర గాజాకు వెళ్ళినట్లు ఆయన తెలిపారు. కీలకమైన, ప్రాణాధార మందులు, ఆహారం, శిబిరాలను ఈ ట్రక్కుల్లో పంపడాన్ని సాధ్యం చేసిన అనేకమందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలని ఆయన పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశపై చర్చలు జరపడానికి ఇజ్రాయిల్, హమాస్ సన్నద్ధమవుతును వేళ ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గత 15మాసాలుగా సాగిన ఈ దాడుల్లో గాజాలో 47,518మంది మరణించారు. లక్షకుపైగా క్షతగాత్రులయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి ముందు చాలా స్వల్ప మొత్తంలోనే సాయం అందుతుండడంతో గాజాలో ముఖ్యంగా ఉత్తర గాజాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అంతర్జాతీయ సహాయ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. తాజాగా ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఆహారం, ఇంధనం, వైద్య, ఇతర రకాల సాయం అందడంతో పాటూ ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన వారు పెద్ద సంఖ్యలో స్వస్థలాలకు తిరిగి రావడానికి సాధ్యమైంది.

# గాజాపై ట్రంప్ వ్యాఖ్యలు

## నష్ట నివారణ చర్యలు చేపట్టిన వైట్‌హౌస్



**వాషింగ్టన్ :** గాజా ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుని, అభివృద్ధి పరుస్తామని, అక్కడ గల పాలస్తీనియన్లు ఇతర ప్రాంతాలకు వెళ్ళాలని ట్రంప్ చేసిన సూచనలు, వ్యాఖ్యలపై స్వంత మిత్రులు, పార్టీ నేతల నుండే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో వైట్‌హౌస్ అధికారులు ఆ మాటలకు అర్థాలు చెప్పే పనిలో పడ్డారు. జరిగిన నష్టాన్ని పూడ్చుడానికి ప్రయత్నించారు. ఈ మేరకు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ట్రంప్ ప్రధాన ప్రతినిధి, వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరోలిన్ లెవిట్‌లు వివరణ ఇచ్చారు. గాజాలో పునర్నిర్మాణ పనులు చేపట్టడానికి వీలుగా దాదాపు 18లక్షల మంది పాలస్తీనియన్లను తాత్కాలికంగానే ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాలని భావిస్తున్నారని, అదే ఆయన మాటల ఉద్దేశ్యమని వివరించారు. గాజాపై ట్రంప్ వ్యాఖ్యలను హమాస్, పాలస్తీనియన్లు, అరబ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ప్రమాదకరంగా మారిన భవనాలను పూర్తిగా పడగొట్టి కొత్త వాటిని నిర్మించాల్సి వుందని, ఈలోగా అటువంటి ప్రాంతాల్లో వారు నివసించడం ముప్పుతో కూడిన వ్యవహారమని రూబియో చెప్పారు. అందుకే చాలా ఉదారంగా సాయం చేయడానికి ట్రంప్ ముందుకొచ్చారనివ్యాఖ్యానించారు. వాషింగ్టన్‌లో మరో పత్రికా సమావేశంలో లెవిట్ మాట్లాడుతూ, పాలస్తీనియన్లను తాత్కాలికంగా మాత్రమే వేరే ప్రాంతాలకు తరలించాలని ట్రంప్ భావిస్తున్నారని వివరణ ఇచ్చారు. మానవులు నివసించే ప్రాంతంగా గాజా ఎంత మాత్రమూ లేదని ఆమె వ్యాఖ్యానించారు. అటువంటి దయనీయ పరిస్థితుల్లో ప్రజలు బతకాలనకోవడం ఎంత మాత్రమూ సరికాదన్నారు. బుధవారం పెంటగన్‌లో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌తో నెతన్యాహు భేటీ అయ్యారు. గాజా పునర్నిర్మాణం కోసం గల మార్గాలన్నింటినీ మిలటరీ పరిశీలిస్తోందన్నారు. మిత్రులతో, ఇతర దేశాల ప్రతినిధులతో, దౌత్యపరంగా, సైనిక పరంగా గాజా కోసం కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. ఈజిప్, జోర్డాన్ సహా మధ్య ప్రాచ్యంతోని మిత్ర దేశాలన్నీ ట్రంప్ వైఖరిని ఖండిచాయి.

# మధ్యప్రదేశ్‌లో కూలిన యుద్ధ విమానం



**భోపాల్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం సంభవించింది. వైమానిక దళానికి చెందిన ఓ యుద్ధ విమానం ఒక్కసారిగా కూలిపోయింది. అయితే ఈ ఘటనలో పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం శివపురి సమీపంలో జరిగింది. భారత వైమానిక దళానికి చెందిన ట్విన్‌సీటర్ మిరాజ్ 2000 ఫైటర్ జెట్ శిక్షణలో భాగంగా గాల్లోకి ఎగిరిన విమానం ప్రమాదశాత్తూ బహ్రేటా సాని గ్రామ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కుప్పకూలింది. దీంతో వెంటనే పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టారు. గాయపడ్డ పైలట్లను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రసంగమంతా ప్రతిపక్షాలపై అభండాలే



**న్యూఢిల్లీ:** గురువారం రాజ్యసభలో ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగమంతా ప్రతిపక్షాలపై అభాండాలు వేయానికే కేటాయించారు. దేశంలో సమస్యలను ప్రస్తావించకుండా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ కులమత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం రాజ్యసభలో మోడీ ప్రసంగించారు. నేషన్ ఫస్ట్ తమ విధానమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 2014 తరువాత దేశం ఒక కొత్త నమూనాను చూసిందని చెప్పారు. కాంగ్రెస్ స్వార్థపూరిత రాజకీయాలు అందరినీ మోసం చేశాయని విమర్శించారు. తాము బాబా సాహెబ్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి పేదలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. అలాగే, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి తాము ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. మొదటిసారి వ్యాపారంలోకి వస్తున్న వారికి ముద్ర పథకంతో ఎలాంటి హామీ లేకుండా రుణం ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా, భవిష్యత్తు పనుల కోసం మనందరికీ మార్గదర్శకంగా ఉందన్నారు. చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ద్వేషించిందని, ఆయనపై ఎంత కోపంగా ఉందో మనకు తెలుస్తుందని అన్నారు. బాబా సాహెబ్‌ను భారతరత్నకు ఎప్పుడూ అర్హులుగా పరిగణించలేదన్నారు. కానీ ఈ దేశ ప్రజలు బాబా సాహెబ్ భావాలను గౌరవిస్తుండటంతో ఈ సమయంలో కాంగ్రెస్ తప్పక జై భీమ్ అనాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ముంబయిలో కార్మికుల సమ్మె జరిగిందని, అప్పుడు ప్రముఖ గీత రచయిత మజ్రూ సుల్తాన్‌పురి బానిస అనే పాటను పాడారని, దీంతో నెహ్రూ ఆయనను జైల్లో పెట్టారని విమర్శించారు. ప్రముఖ నటుడు బలరాజ్ సాహ్ని ఊరేగింపులో పాల్గొంటే ఆయనను కూడా జైల్లో పెట్టారని పేర్కొన్నారు. లతా మంగేష్కర్ సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఆల్ ఇండియా రేడియోలో వీర్ సావర్కర్‌పై ఒక కవిత పఠించాలని అనుకున్నారని, దీంతో ఆయన్ను ఆకాశవాణి నుంచి బహిష్కరించారని తెలిపారు. కాంగ్రెస్ హాయంలో దేశం అత్యవసర పరిస్థితిని కూడా చూసిందన్నారు.

# గిరిజన మహిళలపై ఒడిషా సిఎం అనుచిత వ్యాఖ్యలు



**భువనేశ్వర్ :** గిరిజన మహిళలను ఉద్దేశించి ఒడిషా ముఖ్యమంత్రి, బిజెపి నాయకులు మోహన్ మాఝి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజన యువతులు అందంగా ఉండరని, వారు నల్లగా ఉంటారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అందుకే తాను గిరిజన యువతిని పెండ్లి చేసుకోలేదని పేర్కొన్నారు. మయూర్‌భంజ్ జిల్లాలో జరిగిన ఉత్సవ్‌లో ఆయన మాట్లాడుతూ 'నేను తెల్లగా ఉన్న అమ్మాయినే పెళ్లాడలని ఎప్పుడూ కోరుకున్నా. కానీ గిరిజన అమ్మాయిలు అందంగా ఉండరు. అందుకే నేను మయూర్‌భంజ్ అమ్మాయిని పెండ్లి చేసుకున్నా. ఆ జిల్లాతో నా అనుబంధం అలా ఏర్పడింది' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గిరిజన మహిళల మనోభావాలను దెబ్బతీశాయని, ఆయన క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష బిజు జనతాదళ్ (బిజెడి) డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఆయన వివక్షత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని బిజెడి సీనియర్ నేత సరోజిని హెంబ్రామ్ విమర్శించారు. గిరిజనుల భద్రత, సంక్షేమానికి కృషి చేయడానికి బదులుగా గిరిజన మహిళల అందం గురించి అమానకరంగా మాట్లాడ్డం నిజంగా దురదృష్టకరమని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజనుల అభివృద్ధి నిర్లక్ష్యం చేయబడిందని విమర్శించారు. కాంగ్రెస్ కూడా ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది.

# పెండింగ్ బిల్లుల ఆమోదానికి మూడేళ్లెందుకు..?



**న్యూఢిల్లీ:** తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను నిలిపివేయడంపై మండిపడింది. బిల్లుల ఆమోదానికి మూడేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించింది. అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులను గవర్నర్ క్లియర్ చేయకపోవడంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన తాజా పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. గవర్నర్ ఆర్‌ఎన్ రవి తీరుపై సుప్రీకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రశ్నలు సంధించింది. బిల్లును తిరిగి పంపేందుకు గవర్నర్ కారణాలు చెప్పకూడదా? అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లును రాష్ట్రపతికి గవర్నర్ పంపవచ్చా? గవర్నర్ అన్ని రకాల బిల్లులను రాష్ట్రపతికి పంపవచ్చా? గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితిని నిర్ణయించవచ్చా? అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం ఇవ్వాల్సిన అవసరం ఉందా? రాష్ట్రపతి నుంచి ఏమి ఆశించాలి? అని ప్రశ్నలు అడిగింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. నేటి విచారణలో తమ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని గవర్నర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

# అమెరికాకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు



పనామా సిటీ : పనామా కాలువలోనుంచి అమెరికా ప్రభుత్వ నౌకలు ప్రయాణించే సమయంలో వాటి నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయమని పనామా చెప్పినట్టు అమెరికా ప్రకటించింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని పోస్టు చేసింది. కానీ , పనామా మాత్రం అలాంటి రాయితీలేమీ ఇవ్వలేదంటూ తాజాగా ప్రకటన విడుదల చేసింది. తాజాగా పనామా కెనాల్ అథారిటీ స్పందిస్తూ..“ టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి మా పరిధి లోకి వస్తాయి. ఇప్పటివరకు ఎటువంటి సవరణలు చేయలేదు” అని ప్రకటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ వారం లాటిన్ అమెరికా దేశాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కెనాల్‌పై చైనా నియంత్రణల్లో తక్షణమే మార్పులు తీసుకురావాలని ఆయన గట్టిగా ఒత్తిడి చేయనున్నారు. ఆ దేశం చర్యలు తీసుకోకపోతే మాత్రం తాము ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని ఆయన చెబుతున్నారు. ఆయన తాజాగా పనామా అధ్యక్షులు జాస్ రౌల్‌తో భేటీ ఆయ్యారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# గ్రామాల సమగ్ర అభివృద్ధి కృషి చేస్తా



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 07:-** గ్రామాల సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముధోల్ లోని క్యాంప్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు సిసి రోడ్లు డ్రైనేజీ కొరకు రూ 10 కోట్లు మంజూరు చేసినందుకు స్థానిక నాయకులు ఎమ్మెల్యేను శాలువత సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని వెల్లడించారు. స్థానిక నాయకులు, ప్రజలు సైతం గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవోజి భూమేష్, బీజేపీ నాయకులు తాటివార్ రమేష్, జీవన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలి



**ముధోల్ మన వెలుగు ఫిబ్రవరి 07:-** విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్రావు పటేల్ అన్నారు. లోకేశ్వరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల -కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం-మన్మద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-రాజురా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మెన్ మోహన్ రావ్ పటేల్ గ్రామస్థుల సమక్షంలో ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చదివేమెళకువలు అనుసరించాలని వివరించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని, ప్రతి ఒక్కరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు పై చదువులు చదవడానికి ఏదైనా ఇబ్బంది ఎదురైతే మా ప్రజా ట్రస్ట్ సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు పాఠశాల అధ్యాపకులు మోహన్ రావ్ పటేల్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అధ్యాపకులు, ట్రస్ట్ టీం సభ్యులు, లోకేశ్వరం మండల నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# బాసర త్రిబుల్ ఐటీ లో విద్యార్థుల ఆందోళన



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 07:-** బాసర త్రిబుల్ ఐటీ లో విద్యార్థులు మళ్లీ ఆందోళన దిగారు పరీక్ష లు బాగా రాసిన ఫెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం యూనివర్సిటీ కార్యాలయంలో నిరసన తెలిపారు బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కొంతమంది విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్లు తనిఖీ అనంతరం పాస్ మార్కులు వేయించినట్లు విద్యార్థులు పేర్కొన్నారు

# సకల కళలకు ప్రతీక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

## - రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆష్ట దిగంబర్



**నిర్మల్ (మనవెలుగు)** :ఈ నెల పదకొండవ తారీఖున నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ పన్నెండవ వార్షికోత్సవం లో భాగంగా ఈ రోజు నిర్మల్ పట్టణంలో ప్రముఖ నాయకులను, కళాపోషకులను కలిసి కరపత్రాలను అందజేయడం జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారులే కాకుండా నిజామాబాదు, కరీంనగర్ నుండి వస్తున్న కళాకారులందరు పాల్గొనున్నారని టీఎస్కేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆష్ట దిగంబర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు పాట రాజశ్రీ మొగిలి మమత బన్నీ బ్రహ్మం గౌరవ అధ్యక్షులు పాట మహేష్ పాల్గొన్నారు. కళాకారులందర్నీ ఏకతాటిపై తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా మేము జరపబోయే ఈ పన్నెండవ వార్షికోత్సవము సందర్భంగా వివిధ కళారూపాలైన చిందు యక్షగానం, జానపద నృత్యం, జానపద పాటలు, పద్యం గద్యం, శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, భరతనాట్యం, ధీంసా నృత్యాలతో పాటుగా ఇతరాత్ర కళలు ఇందులో కనబరుస్తారని ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యి విజయవంతం చేయాలని కోరారు.

# మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో అసభ్యకర ప్రవర్తించిన ప్రబుద్ధుడు



**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 07:** హైదరాబాద్ మహానగరంలోని తార్నాకలో ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్న ఓ మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో అసభ్యకరంగా ప్రవర్తించాడు పృథ్వీరాజ్ అనే వ్యక్తి. మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ తన విధుల్లో తాను బాధ్యతాయుతంగా ఉండగా.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆ వ్యక్తి మధ్య వేలు చూపిస్తూ.. చేతితో అసభ్యకరంగా సైగలు చేశాడు. ఈ సంఘటన 5న జరగగా.. కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విధుల్లో ఉన్న మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ సిబ్బంది నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ ప్రబుద్ధుడిని నాంపల్లి కోర్టుకి తరలించగా.. పృథ్వీరాజ్‌కు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

# బాసరలో శిశు మందిర్ పాఠశాల పునఃప్రారంభం



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 07:-** గతంలో చదువుల తల్లి జ్ఞాన సరస్వతీ కొలువైన బాసరలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల నడుపబడి కొన్ని కారణాల వల్ల 10 సంవత్సరాల క్రితం మూతపడింది. సంస్కారయుతమైన విద్యను అందించే శిశు మందిర్ మూతపడం బాసర గ్రామ ప్రజలకు వెలితి అనిపించింది. ఎలాగైనా సరే శ్రీ సరస్వతీ శిశు మందిర్ ను తిరిగి పునఃప్రారంభించాలనుకున్న హితైషులు, పూర్వ విద్యార్థులు, పూర్వ పోషకులు అందరూ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని వారి నిర్ణయాన్ని శ్రీ సరస్వతీ విద్యాపీఠం పెద్దలకు తెలియజేశారు. దీంతో శ్రీ సరస్వతీ విద్యాపీఠం పెద్దలు గ్రామ పెద్దలతో కలిసి కొండూర్ ప్రతాప్ రావ్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిటీ నిర్ణయం మేరకు ఈరోజు వేకువ జామున ఉ.2:45 ని.లకు భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఉ.10:00 గం.లకు పాఠశాల పునఃప్రారంభ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్, సిబిఆర్ ప్రసాద్, పరమానంద బన్సల్ పాల్గొని మార్గదర్శనం చేశారు. వీరితో పాటు క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్య నారాయణ, విభాగ్, జిల్లా అధికారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ముధోల్ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల పునఃప్రారంభం కావడం పట్ల అందరూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# లగచర్ల గ్రామం లో కొనసాగుతున్న భూ సర్వే

**కొడంగల్ (మన వెలుగు ) ఫిబ్రవరి 07 :** హకీంపేట్ లో పారిశ్రామిక వాడ లో భాగంగా కొనసాగుతున్న భూ సర్వే లో భాగంగా ఈరోజు దుద్యాల మండలంలోని రోటి బండ తండా, లగచర్ల, పులిచర్ల కుంట తండాలో రెవెన్యూ అధికారులు సర్వేచేస్తున్నారు.. లగచర్ల లో గతంలో కలెక్టర్ పై జరిగిన దాడిని దృష్టిలో పెట్టుకొని పోలీసు లు అధికారులు పెద్ద ఎత్తున బలగలను మొహరించి సర్వే నిర్వహిస్తున్నారు.. వందలాది మంది పోలీసులు గ్రామానికి రావడంతో లగచర్ల, రోటిబండ తండా, పులిచర్ల కుంట తండా ప్రజల ఆందోళన గురయ్యారు. రోటిబండ తండా లో సర్వే కోసం వచ్చిన అధికారులను తమ గ్రామంలో సర్వే నిర్వహించవద్దని మేము ఇండస్ట్రియల్ కారిడర్ కోసం భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని గిరిజన మహిళలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు... లగచర్ల గ్రామంలో చేపడుతున్న భూ సర్వే ప్రస్తుతం పోలీస్ పహార మధ్య ప్రశాంతంగా కొనసాగుతుంది

# కల్యాణ లక్ష్మి షాదిముభారాజ్ చెక్కుల పంపిణీ



**కొడంగల్ (మన వెలుగు ) ఫిబ్రవరి 07:** దౌల్తాబాద్ మండల కేంద్రం లో కల్యాణలక్ష్మి షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి గారి సోదరుడు తిరుపతి రెడ్డి గారు పాల్గొనటం జరిగింది దౌల్తాబాద్ మండలంలో 51 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ విజయకుమార్ గారు ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్రావు గారు,బోడి వెంకటరెడ్డి గారు,మాజీ ఎంపీటీసీ కుర్మాని మంజుల దస్తప్ప గారు మరియు శివరాం సింగ్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు



**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 07:** బీసీల విషయంలో తాము ఒకడుగు ముందే ఉండాలని ఉబలాటపడిన కాంగ్రెస్ పార్టీకి.. కులగణన సర్వే నివేదికను విడుదల రోజే ఊహించని షాక్ తగిలింది. బీసీల విషయంలో బీఆర్ఎస్, బీజేపీలకు తామేం తీసిపోమన్నట్టుగా దూకుడుమీదున్న హస్తం పార్టీ.. సొంత పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీరుతో హతవిధీ అన్నట్టుగా తలకొట్టుకుంటోంది. కులగణన చేసి చరిత్ర సృష్టించామని పార్టీ చెబుతుంటే%ౌ% దాన్ని చెత్తబుట్టలో వేయాలంటూ మల్లన్న వ్యాఖ్యానించడం చర్చనీయాంశమవుతోంది. బీసీ సర్వే నివేదిక ప్రతులకు నిప్పు పెట్టడమూ.. అధికార కాంగ్రెస్‌ను కుదిపేసింది. అందుకే, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ.. మల్లన్నకు షోకాస్ నోటీసులు జారీ చేసింది.బీసీ నినాదం ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇతర వర్గాలతోనూ అంతే ఆదరణతో వ్యవహరించాలని భావిస్తోంది. అయితే, ఇటీవల బీసీ వర్గాలు నిర్వహించిన యుద్ధభేరి సభలో కాంగ్రెస్ ఎమ్మెల్సీగా పాల్గొన్న తీన్మార్ మల్లన్న%ౌ% రెడ్లు, వెలమలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. తన వర్గం గొప్పదని చెప్పుకోవడానికి.. అవతలి వర్గాలను కించపరిచేలా మాట్లాడటం కరెక్టు కాదన్న చిన్న సెన్స్‌ను ఆయన మిస్సయ్యారన్న అభిప్రాయం వ్యక్తవుతోంది.ఉచ్చనీచాలు ఎంచుతూ.. తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్స్%ౌ% అటూఇటూ తిరిగి కాంగ్రెస్ మెడకే చుట్టుకుంటున్నాయ్. అధికార పార్టీ ఎమ్మెల్సీగా ఉంటూ.. ఆయన రెండువర్గాలను తీవ్రపదజాలంతో దూషించడం రచ్చకు దారితీసింది. ఇప్పటికే సొంత పార్టీలోని ఆయా వర్గాల నాయకులు.. మల్లన్నపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ప్రభుత్వంలో మంత్రుల నుంచి ఎమ్మెల్యేల దాకా.. మల్లన్న తీరును తప్పుబట్టనివారు లేరు. ఆచితూచి మాట్లాడాలని పొన్నం అంటే.. ఆయన ఏ పార్టీవారో తేల్చుకోవాలన్నారు మరో మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# విచారణకు హాజరైన రామ్‌గోపాల్ వర్మ



**ఒంగోలు** రూరల్ పోలీస్టేషన్ ఉదయం నుంచి రాత్రి వరకు ఆయనను పోలీసులు విచారించారు. ఇందులో భాగంగా మొత్తం 50 ప్రశ్నలు ఆర్జీవీకి సంధించినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో కొన్ని ప్రశ్నలకు తనకు గుర్తు లేదని, తెలియదని ఆర్జీవీ రిప్లై ఇచ్చినట్లు సమాచారం. పోలీసులు ఆలోచించుకునేందుకు మరింత సమయం ఇచ్చినా డైరెక్టర్ సరైన సమాధానం చెప్పలేకపోయారని తెలుస్తోంది. దీంతో పోలీసులు రామ్ గోపాల్ వర్మ స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. మరోసారి విచారణకు రావాలని సూచించారు. ఇక విచారణ ముగియడంతో రామ్ గోపాల్ వర్మ పోలీసు స్టేషన్ నుంచి బయటకు వెళ్లారు. అయితే ఇంతలోనే ఆర్జీవీకి మరో షాక్ ఇచ్చారు గుంటూరు పోలీసులు.